# పురుషోత్తమ చౌధరి కీర్తనలలోని వేదాంత భక్తి భావాలు

## భక్తి సాహిత్యంలో నింగికి ఎగసిన మహా కెరటం - పురుషోత్తమ చౌధరి

- రెవ. డా॥ పి. జె. క్రిస్టకుమార్,
ప్రిన్సిపాల్, ఎసిటిసి.

జ్ఞాన సాహిత్యములో సొలొమోను మహారాజు ఎలానో, భక్తి సాహిత్యములో ఒక మణిపూస పురుషోత్తమ చౌధరి. వీరి ప్రతి కీర్తన ఒక భక్తి సందేశం. భక్తుని అమూల్యమైన సంపద. అది అతని రక్షణ సందేశానికి సజీవ సాక్ష్యం. అతని అనుభవాల పొదినుండి ఎక్కుపెట్టబడిన రక్షణ బాణం - ఇలా చెప్పుకొంటూ పోతే అంతే వుండదు.

పురుషోత్తమ చౌధరి ప్రతి కీర్తనలో సజీవుడైన క్రీస్తు అగుపడతాడు. వికసించిన కుసుమాలలా అతని కీర్తనలు, సువార్త, రక్షణ, పశ్చాత్తాపం, తీర్పు వంటి ఉత్తమమైన పరిమళాన్ని వెదజల్లుతాయి. సంగీతమంటే తమిళ భాషలో 'ఇసాయి' అనే అర్థం వుంది. అనగా భక్తుని దేవునితో బంధించేది అనే భావం. క్రైస్తవ భక్తి సంగీతం కూడా ఇలాంటిదే.

నేడు భావం లోపించి, శాస్త్ర నియమావళి కొరవడిన పాటలు, కోకొల్లలు. పురుషోత్తమ చౌదరిగారి పాటల్లో, మాటల్లో సంగీత నిబద్ధత వుంది. భక్తి పారవశ్యం తో వుంది. అల్లబడిన రక్షణానుభవం కూడా వుంది. చౌధరి గారి ప్రతి పాట వేదాంత భావాలతో నిండుకొన్న ఒక ఊట. దైవశాస్త్ర యభిప్రాయాలతో నిండుకొన్న ఒక మూట. చౌధరి గారి పాటలు, ప్రసంగాలు, విశ్వాసికి వీనుల విందుగా వుంటూ అతనికి అభయం, ఆనందం, ఆప్యాయతా, అనురాగం, ఆదరణ కలిగిస్తాయి.

చౌదరికి సంగీతం, కవిత్వం దేవుడిచ్చిన సొత్తు. తరగని, కరగని స్థిరాస్థి. సంగీతం దేవుని హస్తం అన్న మార్టిన్ లూథర్ వాక్యం ఈయనలో నెరవేరింది. సంగీతం దేవుని హస్తమే గాక, మృదువైన ఆయన హృదయం కూడా. చౌధరి కీర్తనల సారాంశం పాపి, అతని తొట్రుపాటు, మంలా దేవుడు అతని ఎలా పునరుద్ధరించాడో, దానివల్ల అతనికి ఉత్పన్నమయ్యే రక్షణానందం ప్రాముఖ్యంగా కొట్టవచ్చినట్టు కనబడతాయి. భక్తుడికి కలిగే చింత ఒకవైపు, అతడు పొందబోయే నిత్యానందం ఒకవైపు. చౌధరి కీర్తనల సారాంశం. చింత భక్తుని కృంగదీస్తుంది. మెరిమ్నా అనే గ్రీకు పదం చింత అనే పదం యొక్క లోతైన విషయాలను తెలుపుతోంది. మెరియ్నా ఒక వ్యక్తియొక్క అనిశ్చయతను, ఆందోళనను, సంకుచిత స్వభావాన్ని కండ్లకు కట్టినట్లు చూపిస్తోంది. ఈలాంటి చింత, చీకాకు బారి నుండి దేవుడు భక్తుని కాపాడి 'నిత్యానందం' ప్రసాదిస్తాడు.

'యెహోవా నా మొర లాలించెను' అన్న కీర్తన అతని జీవితంలో దేవుడు జరిగించిన రక్షణ కార్యాన్ని గాన రూపంలో వెలువరిస్తోంది. దేవుడు తప్పిపోయిన పాపిని ఎలా మరలా క్షమించి, తన కృపా ప్రాంగణంలోకి ప్రవేశపెట్టాడనే సత్యాన్ని ఈ కీర్తన చక్కగా కండ్లకు కట్టినట్టు వివరిస్తోంది; వినిపిస్తోంది.

చంచలమైన మనసును, తన స్వంత ఆలోచనలను, విషయాలను కుదించి, మదించి ఆయన ప్రతి తలంపును నిర్ణయనాన్ని అక్షరాల నెరవేరుస్తోంది. దేవుడు తనను ఎలా నెడ దిద్దాడో మొదటి చరణంలో గానాలాపన చేసినపుడు 23వ కీర్తనలో ' ఆయన నా ప్రాణమునకు నెమ్మది తిరుచున్నాడు ' అన్న దావీదు కీర్తన జ్ఞాపకం వస్తోంది. దీనినే దేవ శాస్త్రజ్ఞులు Hesukia స్థితిగా గుర్తిస్తారు. అనగా కోల్పోయిన శక్తిని, ఉత్సాహాన్ని బలాన్ని తిరిగి పుంచుకోవడమే.

పురుషోత్తమ చౌధరి ప్రతి కీర్తనలో భక్తి భావాలతో పాటు దేవ శాస్త్రపరమైన అభిప్రాయాలు అతి స్పష్టంగా కనబడుతాయి.
" ఉన్నపాటున వచ్చుచున్నాను నీ పాద సన్నిధికో రక్షకా'' అను అమర సంగీతం నేటికి సజీవంగా ప్రతి విశ్వాసి హృదయంలో మెదులుతూనే వుంటుంది. ప్రతి పాట భక్తుని సంపూర్ణ సమర్పణను ఆయనపై పూర్తిగా " ఆనుకొనుటను'' సూచిస్తూ ఆధునిక వేదాంత పితామహుడు ష్లయర్ మాఖర్ మతమనగా పూర్తిగా దేవునిపై ఆధారపడుతోందన్న అభిప్రాయాన్ని బలపరుస్తుంది.

ఉన్నపాటున దేవుని సన్నిధికి వచ్చుచున్నాను... ఆయన సన్నిధిలో "నిలువబడుట'' మత సంస్కరణ కాలం నాటిదేవశాస్త్ర భావాలనెన్నో చూపిస్తోంది. కాల్విన్ Total depraved సిద్ధాంతం దానిలో ముఖ్యమైనది. పాపి ఏవిధమైన అర్హత లేకుండా దేవుని కృపను పొందగలగటం, ఆతని విరిగి, నలిగిన హృదయానికి సంకేతం.

దేవుని కృపలో నమ్మిక, నెమ్మది, శరణు, భక్తుడు కనుగొంటాడు. నీ చరణములే నమ్మితి, నమ్మితి.. యని పురుషోత్తమ చౌధరి గానాలాపం చేస్తాడు. క్రీస్తు పాదాల చెంత తనకు పరిపూర్ణ విశ్రాంతి, ఆత్మకు ఆనందం దొరుకుతుందని చౌధరి దృఢంగా విశ్వసించాడు. లోకంలో విసికి వేసారి పోయిన తన జీవితానికి ఉపశమనం కలిగినట్లుగా ఇతడు భావిస్తాడు. జీవితంలో కృంగిపోయినపుడు సాతానుకు తాత్కాలికంగా లొంగిపోయినపుడు దేవుడే భక్తుని పైకి లేవనెత్తగలడని పురుషోత్తమ చౌధరి వ్యక్తిగతంగా గ్రహించాడు. భక్తుని ఖండించక మరలా ఆతనికి క్రీస్తుతో సహవాసంలో పునఃప్రవేశం చేయుగల భాగ్యం దొరుకుతుందని చౌధరి ప్రగాఢ విశ్వాసం.

దేవుని స్వయంగా ఎరిగి వున్న వారి స్థితి – ఎవరు భాగ్యవంతులవనిలో అని తన కీర్తనలలో చక్కగా విపులీకరిస్తాడు. నిజమైన ఆధ్యాత్మిక సౌభాగ్యస్థితిని కండ్లకు కట్టినట్లుగా చూపిస్తాడు.

చౌధరి ప్రతి కీర్తన వేదాంత భావాల పుట్ట. పుట్ట పగిలినట్లు దేవశాస్త్ర సిద్ధాంతాలు ఉద్భవిస్తూ ఉంటాయి. ', ఇదిగో నా శిష్యులారా మెలకువ నుండండి '' అన్న కీర్తనలో యేసు రెండవ రాకడ, క్రైస్తవ నిరీక్షణ గొప్ప అభయం, క్రైస్తవ నమ్మికను చూపిస్తాయి. రెండవ రాకడను నమ్మని అజ్ఞేయవాదులకు,

అవిశ్వాసులకు ఈ పాట ఎన్నో చురకలు వేస్తోంది.

చౌధరి సిలువ సిద్ధాంతం కేవలం దేవశాస్త్రపరమైనదే కాక, జీవనపరమైనది కూడా. అతని సిలువ సంగీతం పాశ్చాత్య నల్ల జాతీయుల భక్తి గీతాలను కూడా అధిగమించిపోతుందనుటలో అతిశయోక్తి లేదు.

'' చూడరే సిలువను వేలాడు యేసయ్యను ''

అనే సిలువ గీతం మనలను సిలువ దగ్గర వున్న అనుభూతిని కల్పిస్తుంది , కలిగిస్తుంది. సిలువను 'చూచుటే కాక' సిలువ అనుభవములో కురేనీయుడైన సీమోను లా లీనమై ఔన్నత్యమైన అనుభూతిని భక్తుని హృదయంలో కలిగిస్తోంది. ఇలా విశ్లేషించుకుంటూ పోతే చౌధరి అనే వేదాంత గని నుండి ఎన్నో వేదాంత రత్నాలు దొరుకుతాయి. డా|| రావెల జోసెఫ్ గారి వ్యాసాలు దీనికొక చక్కని సాదృశ్యం. వారిని దేవుడు దీవించాలని మనసార ప్రార్థిస్తూ, మరెన్నో రత్నాలు వారి వేదాంత గనినుండి దొర్లి రావాలని కోరుతూ...

- రెవ. డా|| బి. జె. క్రిస్టి కుమార్,
ప్రిన్సిపాల్, ఎసిటిసి.